క్లుప్తంగా

ఘనంగా హజరత్ ఖాజా బందేనవాజ్ ఉరుసు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని మన్రో సత్రం వద్ద కర్నూలు రోడ్డులో హజరత్ ఖాజా బందేనవాజ్ గ్రేస్ దాస్ దర్గాలో శనివారం ఉరుసు ఘనంగా నిర్వహించారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున దర్గా కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిరాడంబరంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పీరా, దర్గా కమిటీ సభ్యులు అఫ్జల్ బాషా, ఖలీల్, రషీద్, సైదు, రహంతుల్లా, డిష్ ఖాసీం, షఫి, రఫి, పాషా, నబీ తదితరులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఉరుసు సందర్భంగా క్రాంతి టైలర్ ఫక్రుద్దీన్ కుటుంబ సభ్యులు పవిత్ర ఖురాన్ పుస్తకాలను మదరసా పిల్లలకు ముస్లిం మత గురువు అన్వర్ పాషా చేతుల మీదగా అందజేశారు.

బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి

పెద్దవడుగూరు: కిశోర బాలికలు రోజూ పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ వెంకటలక్ష్మీ పేర్కొన్నారు. శనివారం మండలంలోని కాశేపల్లిలో కిశోర బాలికలకు పౌష్టికాహార లోపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా కిశోర బాలికలకు అందించే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త బాగ్యలక్ష్మి, ఏఎన్‌ఎం సౌభాగ్య, ఎంఎల్‌హెచ్‌పీ అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

యాడికి: ఆడపిల్లలు రుతుక్రమ సమయంలో ఐరన్, ప్రొటీన్ సమృద్ధిగా ఉండే సమతుల ఆహారం తీసుకోవాలని తాడిపత్రి ఐసీడీఎస్ సీడీపీఓ షాదిజాభేగం సూచించారు. శనివారం మండలంలోని తూట్రాళ్లపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో ఆడపిల్లల రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలు నెలసరి సమయంలో పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో యాడికి, రాయల చెరువు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు విజయకుమారి, హుసేనమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

30న బియ్యం, బేడల బహిరంగ వేలం

పెద్దపప్పూరు: మండలంలోని అశ్వర్థనారాయణ స్వామి క్షేత్రంలో మాఘమాసం తిరుణాల సందర్భంగా భక్తులు స్వామికి సమర్పించిన బియ్యం, బేడలను ఈ నెల 30న వేలం వేయనున్నట్లు శనివారం ఆలయ కార్యనిర్వహణాధికారి సుబ్రమణ్యం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలన్నారు.

ప్రతి విద్యార్థికీ పుస్తకాలందించడమే లక్ష్యం



పుస్తకాలను పరిశీలిస్తున్న జిల్లా విద్యా కానుక కమిటీ సభ్యుడు గోవిందరెడ్డి

పెద్దవడుగూరు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికీ విద్యా కానుక కిట్లు అందించడమే లక్ష్యమని (ఏఎల్‌ఎస్‌సీఓ) జిల్లా విద్యా కానుక కమిటీ సభ్యుడు గోవింద్‌రెడ్డి, ఎంఈఓ రాముడు అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ పాఠశాలలో నిల్వ ఉంచిన పాఠ్య పుస్తకాలను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం కాశేపల్లి, భీమునిపల్లి, పెద్దవడుగూరు తదితర గ్రామాల్లోని ప్రత్యేక అవసరాలు గల పిల్లల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వం అందించే సౌకర్యాలను వివరించారు. కార్యక్రమంలో ఐఈడీ కోఆర్డినేటర్ షామ, ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్పీలు, ఐఈఆర్‌పీలు పాల్గొన్నారు.

కౌంటింగ్‌పై ఉత్కంఠ

- కసాపురం బూత్ నుంచి ఓట్ల లెక్కింపు
- ఒక్కో రౌండుకు 14 టేబుళ్ల ఏర్పాటు
- 20 రౌండ్లలో తేలనున్న గుంతకల్లు అసెంబ్లీ ఫలితం



ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు (ఫైల్)

గుంతకల్లు: సార్వత్రిక ఎన్నికలు ముగియడంతో కౌంటింగ్‌పై ఉత్కంఠ నెలకొంది. జూన్ 4న గుంతకల్లు నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు మండలంలోని కసాపురం గ్రామ పోలింగ్ బూత్ నుంచి ప్రారంభమవుతుందని అధికారులు తెలిపారు. నియోజకవర్గంలోని 276 పోలింగ్ బూత్‌ల్లో పోలింగ్ నిర్వహించారు. నియోజకవర్గం వ్యాప్తంగా మొత్తం ఓటర్లు 2,70,648 మంది ఉండగా అందులో 2,03,820 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 75.31 ఓటింగ్ శాతం నమోదు అయ్యింది. అనంతపురంలోని జేఎన్‌టీయూలో జూన్ 4న ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరుగుతుంది. ఒక్కో రౌండుకు 14 టేబుళ్ల ఏర్పాటు చేసి ఒక్కో రౌండ్‌లో 14 ఈవీఎం లెక్కిస్తారు. ఇలా 20 రౌండ్లలో లెక్కించేటట్లు ఏర్పాట్లు చేశారు.

కసాపురం నుంచి ఓట్ల లెక్కింపు..

నియోజకవర్గానికి సంబంధించి ఓట్ల లెక్కింపు కసాపురం గ్రామంలోని పోలింగ్ బూత్–1 నుంచి ప్రారంభమవుతుంది. అక్కడ నుంచి 25వ పోలింగ్ బూత్ (జీ.కొట్టాల) వరకు గుంతకల్లు రూరల్ పరిధిలోకి రాగా, 26 నుంచి గుంతకల్లు అర్బన్‌లోకి ఎంటర్ అవుతుంది. 26 పోలింగ్ బూత్ నుంచి 131వ పోలింగ్ బూత్ వరకూ గుంతకల్లు అర్బన్ పరిధిలోకి వస్తాయి. 132 బూత్ నుంచి తిరిగి గుంతకల్లు రూరల్ పరిధిలోని దొనిముక్కల పోలింగ్ బూత్ నుంచి ప్రారంభమై 148 పోలింగ్ బూత్ అయ్యవారిపల్లితో ముగిస్తుంది. అక్కడ నుంచి ఊటకల్లుకు చెందిన 149 పోలింగ్ బూత్ నుంచి గుత్తిరూరల్ ప్రారంభమవుతుంది. ఈ బూత్ నుంచి 172 ఎంగిలిబండ వరకూ గుత్తి రూరల్ పరిధిలోకి రాగా 173వ పోలింగ్ బూత్ నుంచి గుత్తి అర్బన్‌కు సంబంధించిన పోలింగ్ కేంద్రాలు ప్రారంభమవుతాయి. అక్కడ నుంచి ప్రారంభమైన గుత్తి అర్బన్ ఏరియా 209వ పోలింగ్ బూత్ గుత్తి ఆర్‌ఎస్‌తో ముగుస్తుంది. తిరిగి 210 పోలింగ్ బూత్ నుంచి గుత్తి రూరల్ పరిధిలోని లచ్చనుపల్లి నుంచి ప్రారంభమై 224 పోలింగ్ బూత్ ఈశ్వరపల్లితో ముగుస్తుంది. 225 పోలింగ్ బూత్ పామిడి మండలం రామరాజుపల్లితో ప్రారంభమై 276 బూత్ వంకరాజు కాల్వతో గుంతకల్లు నియోజకవర్గం ముగుస్తుంది. ఇందులో గుంతకల్లు రూరల్ పరిధిలో 42 పోలింగ్ బూత్‌లు, గుంతకల్లు అర్బన్‌లో 106, గుత్తి రూరల్ 39, గుత్తి అర్బన్‌లో 37, పామిడి పంచాయతీలో 52 పోలింగ్ బూత్‌లు వస్తాయి.

21 మంది బైండోవర్

పుట్లూరు: మండలంలోని కందికాపుల, కడవకల్లు, ఎల్లుట్ల, కుమ్మనమల గ్రామాలకు చెందిన 21 మందిని బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ హేమాద్రి శనివారం తెలిపారు. ఎన్నికల ఫలితాల ప్రకటన అనంతరం ఎలాంటి విజయోత్సవాలు నిర్వహించరాదని వారిని హెచ్చరించారు. బాణాసంచా పేల్చడం, ర్యాలీలు నిర్వహించడం చేస్తే చర్యలు తప్పవన్నారు.

యల్లనూరులో 18మంది..

యల్లనూరు: మండలంలోని పెద్దమల్లేపల్లి, యల్లనూరు, బోప్పేపల్లి తదితర గ్రామాల్లో ఎన్నికల కౌటింగ్ నేపథ్యంలో శనివారం పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐ గిరిబాబు ఆధ్వర్యంలో 18 మందిని బైండోవర్ చేశారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా ఉండాలన్నారు. కౌటింగ్ రోజు అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా బైండోవర్ చేశామన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



బసినేపల్లిలో ప్రజలకు సూచనలు ఇస్తున్న ఎస్‌ఐ

గుత్తి రూరల్: కౌంటింగ్ రోజు అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ నబీరసూల్ హెచ్చరించారు. మండలంలోని బసినేపల్లిలో శనివారం ఎస్‌ఐ, పోలీసు సిబ్బందితో పర్యటించి గ్రామ సభ ఏర్పాటు చేసి ప్రజలకు సూచనలిచ్చారు. ఎస్‌ఐ మాట్లాడుతూ జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయని ఏ పార్టీ గెలిచినా, ఓడినా అందరూ సామరస్యంగా ఉండాలన్నారు. విజయోత్సవ ర్యాలీలు చేయడం, బాణాసంచా పేల్చడంపై నిషేధం ఉందని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం గ్రామాల్లో పోలీసు కానిస్టేబుళ్లతో ఎస్‌ఐ కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు హనుమంతు, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

టపాసులు విక్రయిస్తే దుకాణాలు సీజ్



టపాసుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్పీ జనార్దననాయుడు

యాడికి: దుకాణాల్లో టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తాడిపత్రి డీఎస్పీ జనార్దన నాయుడు హెచ్చరించారు. దుకాణాల్లో టపాసులు విక్రయిస్తున్నారనే సమాచారం అందుకున్న తాడిపత్రి డీఎస్పీ శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వెలువడేంత వరకూ బంకుల్లో వాహన చోదకులు, ప్రజలకు బాటిళ్లలో పెట్రోల్ విక్రయించొద్దన్నారు. ఎన్నికల నింబందనలు ఉల్లంఘించే పెట్రోల్ బంకులు , టపాకాయల దుకాణాలను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఎస్పీ వెంట సీఐ నాగార్జున రెడ్డి, పోలీసులు సిబ్బంది ఉన్నారు.

ట్యాంకుపై నుంచి పడి వ్యక్తికి గాయాలు

పామిడి: గ్రామంలంలోని వాటర్ ట్యాంకును శుభ్రం చేస్తూ ప్రమాదవశాత్తు ట్యాంకుపైనుంచి కిందపడి ఓవ్యక్తికి గాయాలపాలైన సంఘటన మండలంలోని రామగిరి ఎగువ తండా గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ప్రమాదంలో గ్రామవాసి తిరుపాల్‌నాయక్ తలకు తీవ్ర రక్త గాయాలపాలయ్యాయి. గ్రామస్తులు వెంటనే అతన్ని పామిడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తీసుకెళ్ళారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ విత్తన వేరుశనగ



బుక్కరాయసముద్రంలో వేరుశనగ పంపిణీ చేస్తున్న ఏడీ రవి



గుత్తి మండలం కొత్తపేటలో వేరుశనగ పంపిణీ చేస్తున్న ఏఓ మస్తాక్ అహ్మద్

బుక్కరాయసముద్రం: అర్హులందరికీ విత్తన వేరువనగ అందించేలా చర్యలు చేపడుతామని జిల్లా వ్యవసాయ శాఖ ఏడీ రవి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని గాంధీ నగర్ సచివాలయం–4 వద్ద సబ్సిడీ వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విత్తనం అందించేలా చర్యలు చేపడుతోందన్నారు. ఇప్పటి వరకూ మండలంలో 2,235 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ఇప్పటికే 1,385 మందికి 1224 క్వింటాళ్ల వేరుశనగ పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్యాంసుందర్‌రెడ్డి, సచివాలయ సెక్రటరీ సువర్ణ, వెల్ఫేర్ అసిస్టెంట్ రమణ, ఆర్బీకే అధికారులు అనూష, రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట, పి.ఎర్రగుడి, పెద్దొడ్డి, బసినేపల్లి, ఊబిచెర్ల, కరిడికొండ, జక్కలచెరువు, అబ్బేదొడ్డి, తురకపల్లి గ్రామాల్లో విత్తన వేరుశనగ పంపిణీ కార్యక్రమాన్ని ఏఓ ముస్తాక్ అహ్మద్ శనివారం తనిఖీ చేశారు. ఏఓ మాట్లాడుతూ వేరుశనగ ఇంకా ఎవరైనా రైతులు పేర్లు నమోదు చేసుకోని వారు ఉంటే, రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏంపీఈఓ షారోన్, వీఏఏ మానస, అజయ్ పాల్గొన్నారు.



శింగనమలలో విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

శింగనమల: మండలంలోని ఆర్బీకేల ద్వారా ఇప్పటి వరకూ 1,070 మంది రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేశామని ఏఓ అన్వేష్‌కుమార్ తెలిపారు. రైతులకు కే6 విత్తన రకం 885.30 క్వింటాళ్లు పంపిణీ చేశామన్నారు. ఇంకా మండలానికి 914 క్వింటాళ్లు రావాల్సి ఉందని, స్టాక్ వచ్చిన వెంటనే రైతులకు పంపిణీ చేస్తామన్నారు. రైతులు విత్తన వేరుశనగను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కళ తప్పిన బండిశిల తిరునాల



అమ్మవారి ఆలయం చుట్టూ ఎద్దులబండ్లతో ప్రదక్షిణం చేస్తున్న రైతులు

పెద్దవడుగూరు: ఏటా వైశాఖ మాసంలో వైభవంగా నిర్వహిస్తున్న బండిశిల తిరునాల కళ తప్పింది. ప్రతి సంవత్సరం పామిడి మండలం రామరాజుపల్లి, పెద్దవడుగూరు మండలంలోని కాశేపల్లి, గుత్తిఅనంతపురం గ్రామాల సమక్షంలో నిర్వహిస్తున్న బండిశిల తిరునాలకు ఎన్నికల నేపథ్యంలో అధికారులు అనుమతి ఇవ్వలేదు. అమ్మవారికి ఏటాలాగే ప్రత్యేక పూజలు చేశారు. అయితే సుడి బండి రథోత్సవం లేకపోవడంతో రైతులు, భక్తులు నిరాశ చెందారు. సుడి బండికి ఎద్దులు కట్టి రథోత్సవం చేయడం ద్వారా అమ్మవారి కృప భక్తులు, రైతులపై ఉంటుందని, పంటలు బాగా పండుతాయనినమ్మకం. అధికారులు తిరునాల జరపడానికి నిరాకరించినా ఎప్పటిలాగానే రైతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, వాహనాలు, ఎద్దుల బండ్లను ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ఈ సందర్భంగా ఆలయం సమీపంలో గాజుల అంగళ్లు, తినుబండారాల అంగళ్లు, చిన్న పిల్లలు ఎగిరే నెట్ జంప్‌లు ఏర్పాటు చేయడంతో సందడి నెలకొంది. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



అలంకరణలో సుంకులమ్మ అమ్మవారు

ఈదురు గాలులకు భారీ నష్టం



పెద్దపప్పూరు మండలం షేక్‌పల్లిలో దెబ్బతిన్న బొప్పాయి పంటను పరిశీలిస్తున్న హెచ్‌ఓ ఉమాదేవి



పుట్లూరు మండలం కందికాపులలో బొప్పాయి తోటలో జరిగిన నష్టాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి నరసింహారావు

- దాదాపు 600 ఎకరాల్లో నేలకొరిగిన అరటి
- పరిశీలించిన ఉద్యానశాఖ అధికారులు

పుట్లూరు: ఈదురు గాలులతో కూడిన వర్షం అరటి రైతులను అతలాకుతలం చేసింది. ఇప్పటికే ధర తగ్గడంతో కనీసం అరకొర ఆదాయం లభిస్తుందని ఆశగా ఉన్న అరటి రైతుల ఆశలపై ఈదురు గాలులు నీళ్లు చల్లాయి. శుక్రవారం రాత్రి వీచిన ఈదురు గాలులతో కూడిన వర్షం వల్ల మండలంలోని కడవకల్లు, ఓబుళాపురం, దోశలేడు, సూరేపల్లి, సంజీవపురం, చెర్లోపల్లి, మడ్డిపల్లి, అరకటివేముల, చింతకుంట, కుమ్మనమల, అరకటివేముల, కందికాపుల తదితర గ్రామాల్లో 600 ఎకరాల్లో అరటి తోటలు నేలకొరిగాయి. మార్కెట్‌లో టన్ను అరటి ధర కనిష్టంగా రూ.12 వేలు ఉండగా, ఎకరాకు 20 టన్నుల చొప్పున రూ.2.4 లక్షలు నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈదురు గాలులు వల్ల చేతికొచ్చిన పంట మట్టిపాలయిందని ఆయా గ్రామాల అరటి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా మండలంలోని చింతకుంట, కడవకల్లు, సూరేపల్లి, సంజీవపురం, చెర్లోపల్లి తదితర గ్రామాల్లో జరిగిన నష్టాన్ని శనివారం ఉద్యానశాఖ అధికారులు, సిబ్బందితో కలసి జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు పరిశీలించారు. నష్టంపై పూర్తి నివేదిక ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



యల్లనూరులో ధ్వంసమైన అరటితోట

యల్లనూరు: మండలంలోని దంతలపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో శుక్రవారం రాత్రి భారీ గాలులతో కూడిన వర్షం కురవడంతో అరటి రైతులు రూ.లక్షల్లో నష్టపోయారు. దంతలపల్లి గ్రామంలో 15 మంది రైతులకు సంబంధించి ఐదు ఎకరాలు, కొత్తపల్లి గ్రామంలో ఒక్క రైతుకు చెందిన ఎకరా పంట నష్టం జరిగినట్లు ఉద్యాన అధికారిణి ఉమాదేవి తెలిపారు.

గుత్తిలో భారీ వర్షం

గుత్తి/గుత్తి రూరల్: గుత్తిలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు కాలనీలో జలమయమైయ్యాయి. 27.4 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ భారతి తెలిపారు. విద్యుత్ స్తంభాలు , వృక్షాలు నేల కూలాయి. కరెంట్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. విద్యుత్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఎంఎస్ ఫుట్‌బాల్ క్రీడా మైదానం, ఎల్‌ఎం ఎయిడెడ్ పాఠశాల ఆవరణలో వర్షం నీరు నిలిచి మడుగులా తయారైంది. మండలంలోని రజాపురం, శ్రీపురం, లచ్చానుపల్లి, మార్నేపల్లి, పెద్దొడ్డితో పాటుగా మరికొన్ని గ్రామాల్లో భారీ ఎత్తున ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో గ్రామాల్లో ప్రధాన వీధులు జలమయం అయ్యాయి. అలాగే లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు ప్రవేశించాయి. రజాపురం గ్రామంలో భారీ గాలులకు చెట్లు నేలకొరిగాయి. భారీ వర్షం కారణంగా రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. కాగా వర్షం భారీగా కురిసి భూములు పదును కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'పెద్దపప్పూరు'లో గాలివాన బీభత్సం

పెద్దపప్పూరు: మండలంలో శుక్రవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. శింగనగుట్టపల్లి గ్రామంలో పిడుగు పడి రైతు నారాయణస్వామికి చెందిన రెండు ఎనుములు మృత్యువాత పడ్డాయి. జిల్లా ఉద్యాన అధికారి నరసింహా రావు, హెచ్‌ఓ ఉమాదేవి శనివారం ముచ్చుకోట, షేక్‌పల్లి, ధర్మాపురం, అమ్మలదిన్నె, పెద్దపప్పూరు, నామనాంకపల్లి గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న ఉద్యాన పంటలను పరిశీలించారు.

తాడిపత్రిలో మోస్తరు వర్షం

తాడిపత్రిటౌన్: తాడిపత్రి మండలంలో శుక్రవారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. దాదాపు 8.2 మి.మీటర్ల వర్షపాతం నమోదవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈదురు గాలులకు చుక్కలూరు గ్రామంలో మామిడి, అల్లనేరేడు పంటలు దెబ్బతిన్నాయి. చెట్లు విరిగిపోవడంతో తీవ్రంగా నష్టపోయామని బాధిత రైతులు వాపోయారు.



పుట్లూరు మండలం చెర్లోపల్లి వద్ద అరటితోటలో నష్టాన్ని పరిశీలిస్తున్న వీహెచ్‌ఏలు



గుత్తిలోని ఓల్డ్ సీపీఐ కాలనీలో విద్యుత్ తీగలపై పడిన చెట్టు కొమ్మలు



గుత్తి మండలం రజాపురంలో నేలకొరిగిన చెట్టు

వైటీ చెరువు గ్రామానికి స్తంభించిన రాకపోకలు



గుంతకల్లు మండలం వైటీ చెరువు వద్ద రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు

గుంతకల్లు రూరల్: మండలంలో శుక్రవారం రాత్రి భారీ ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. మండలంలోని వైటీ చెరువు గ్రామానికి వెళ్లే చెరువు గట్టున ఉన్న చెట్టు దారికి అడ్డంగా కూలిపోయింది. దీంతో గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. గుత్తి మండలం, రజాపురం మీదుగా గ్రామానికి చేరుకోవడానికి మరో దారి ఉన్నప్పటికీ దాదాపు 6 కిలోమీటర్ల దూరం ప్రయాణించివెళ్లాల్సి ఉంది. దీంతో గ్రామస్తులు రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టు కొమ్మలను కొద్దిమేర నరికి ద్విచక్రవాహనాలు వెళ్లేలా రస్తా చేసుకున్నారు. అధికారులు స్పందించి చెట్టును తొలగించి గ్రామానికి రస్తాను పునరుద్ధరించాలని కోరారు.

కుక్కపై చిరుత దాడి

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ గ్రామ శివారులో శనివారం రాత్రి చిరుత పులి కలకలం రేపింది. గ్రామ శివారులో కుక్కపై పులి దాడి చేసింది. వివరాలు.. గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారి నుంచి సాయిబాబా క్రషర్‌కు వెళ్లే దారిలో పులి కుక్కను నోట కరుచుకుని వెళ్తున్న దృశ్యాన్ని ఊబిచెర్ల గ్రామానికి చెందిన టిప్పర్ డ్రైవర్లు రామయ్య, రాజశేఖర్ చూశారు. ద్విచక్ర వాహనం నడుపుతున్న రాజశేఖర్ హారన్ కొట్టడంతో పులి కుక్కను వదిలేసి మారెమ్మ గుడి వైపున ఉన్న కొండపైకి వెళ్లింది. కొండ చుట్టూ గృహాల్లోని ప్రజలు భయంతో వణికిపోతున్నారు. ఫారెస్టు అధికారులకు గ్రామస్తులు సమాచారం అందించారు. కాగా గ్రామంలో కొందరు యువకులు గుంపులుగా విడిపోయి రాత్రి పహారా కాశారు.